క్లుప్తంగా

జగన్మోహిని అవతారంలో సీతారామస్వామి


జగన్మోహిని అవతారంలో దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి.. జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

13న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13న ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ కర్రె స్వప్న బుధవారం తెలిపారు. రమణయ్యపేటలోని మండల పరిషత్ సమావేశపు హాలులో ఉదయం 10.30కు సమావేశం ఉంటుందని చెప్పారు. ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఘనంగా లయన్స్ జోనల్ సమావేశం


ప్రతిభ కనబర్చిన సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: లయన్స్ డిస్ట్రిక్ 316బి స్నేహ సంహిత పేరుతో జోన్ సోషల్, ఫ్యామిలీ గెట్ టుగెదర్.. జోన్ చైర్మన్ కటకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో జరిగింది. జోన్ పరిధిలోని లయన్స్ ఎలైట్, సఖి, మనం, ఫ్రెండ్స్ క్లబ్‌లకు చెందిన అధ్యక్ష , కార్యదర్శులతో పాటు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథి లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఐదు నెలలుగా ఆయా క్లబ్‌ల సేవా కార్యక్రమాలు మరువలేనివన్నారు. సేవలో స్నేహభావం, పోటీతత్వం పెంపొందించడం వల్ల సమాజానికి మేలు చేకూరుతుందన్నారు. జోన్ చైర్మన్ శ్రీనివాసరావు మహిళా క్లబ్‌ల సేవలను కొనియాడారు. ఉత్తమ సేవలందించిన క్లబ్‌లకు అవార్డులు అందించారు. క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సహజ దంతాలను కాపాడుకోవాలి


శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఆహారం అరగాలంటే దంతాలు ఆరోగ్యంగా ఉండాలని, ఇందుకు సహజ దంతాలను కాపాడుకోవాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ తెలిపారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. వృద్ధులకు దంత వైద్య సేవలు అందించారు. వైద్యం పొందిన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

అదనంగా నిత్యావసరాలు ఇవ్వాలి


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: తుపాను నేపథ్యంలో కాకినాడ నగరంలో ముంపు బాధితులకు అదనంగా నిత్యావసర వస్తువులు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. పార్టీ నేతల బృందం బుధవారం నగరంలోని గొడారిగుంట, పర్లోవపేట తదితర ప్రాంతాల్లో పర్యటించింది. కొన్నిచోట్ల ఇళ్లలో నీరు చేరిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రామ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కె.గంగాధర్, ఏడిద కృష్ణ, గాలిదేవర శేఖర్, నక్కా రాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లెయిమ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి

కాకినాడ సిటీ: గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జక్టు టీచర్ల అలవెన్సులపై పనిచేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు వాటిని క్లెయిమ్ చేసుకునే ఉత్తర్వులు ఇప్పించాలని పీఆర్‌టీయూ నాయకులు డీఈఓకు బుధవారం వినతిపత్రం అందించారు. గతేడాది జనవరి 25 నుంచి ఏప్రిల్ 30 వరకు నెలకు రూ.2,500 వంతున సబ్జెక్టు టీచర్లు అలవెన్సుపై సీనియర్ ఎస్జీటీలు పని చేశారన్నారు. దానికి బిల్లును ఎస్టీవోలకు సమర్పించారని పేర్కొన్నారు. సంఘ నాయకులు ప్రదీప్‌కుమార్, ఏజీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వర్షార్పణం


వేళంగి పీహెచ్‌సీకి ఎదురుగా రోడ్డుపై చేరిన నీరు


గురజనాపల్లిలో నేలనంటిన పొలం


యండమూరులో వర్షంనీటిలో తేలుతున్న వరిపనలు

- మిచాంగ్ తుపానుకు తడిసిన వరికుప్పలు, ధాన్యంరాశులు
- ముంపునీటిలో నానుతున్న వరిచేలు
- పంట బీమాపైనే రైతుల ఆశలు

కరప: సార్వా పంట ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో అంతంతమాత్రంగా పంటలతో సతమతమవుతున్న రైతులను.. పంటచేతికొచ్చిన సమయంలో మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. మళ్లలోని వర్షం నీరు దిగకపోవడంతో వరిపనలు, నేలనంటిన పొలాలు ముంపునీటిలో నానుతున్నాయి. పెట్టుబడులైనా వస్తాయో, లేదోనని అనుకుంటున్న తరుణంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తీవ్రంగా నష్టపోయామని రైతులు, కౌలురైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, పంట బీమాతో ఆదుకోకపోతే అప్పుల్లో కూరుకుపోతామని అంటున్నారు.

మొలకలొచ్చి.. రంగుమారి..

మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ముదరగా ఊడ్చిన ప్రాంతాల్లోని రైతులు పంటను ఒబ్బిడి చేసుకున్నారు. లేతగా నాటిన పంట కోతకు రాగా, మిచాంగ్ తుపాను దెబ్బతీసిందని రైతులు అంటున్నారు. తుపానుకు ముందు కోసిన చేలు పనమీద ఉన్నాయని, ముంపునీరు లాగక పనలు నానుతున్నాయని వాపోతున్నారు. ముదరగా ఊడ్చిన పొలాల్లో కోతలు కోసి, మళ్లలోనే కుప్పలు వేశామని, మూడు రోజులు వర్షాలకు కుప్పల పైభాగంలో తడిసిపోగా, అడుగున వర్షంనీరు మోకాలు లోతు నిలిచిపోవడంతో, అవి ఎందుకూ పనిచేయవని రైతు రాయుడు శ్రీను తెలిపారు. లేఅవుట్లలో, రోడ్ల మార్జిన్లలో వేసిన ధాన్యం రాశులు వర్షానికి తడిసిపోయి మొలకలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. నేలనంటిన పంట, కోసిన చేలల్లో ధాన్యం రంగు మారుతోందంటున్నారు. రంగుమారిన, మొలకవచ్చిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరబెట్టుకునే పనిలో..

వర్షం తగ్గడంతో బుధవారం ధాన్యంరాశులు విడదీసి, ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. లేఅవుట్‌లో రాశులుచేసి ఉంచాను, వర్షాలకు తడిసిపోయాయి, కమీషన్ వ్యాపారస్తులు బస్తా రూ.1,200కు అడుగుతున్నారు.. అని వలసపాకలకు చెందిన కౌలురైతు వల్లు దుర్గారావు తెలిపారు. మెషీన్‌తో కోయించి, రోడ్డు పక్కన రాశి వేస్తే, మూడు రోజుల వర్షాలకు అడుగు భాగం ధాన్యం తడిపోయింది. పైన ధాన్యం వేరు చేయగా, కింద వాటికి మొలకలొచ్చాయని కరపకు చెందిన కౌలురైతు ఆచంట శ్రీనివాస్ తెలిపారు. కరప, పేపకాయలపాలెం గ్రామాల్లో వాతావరణం బాగుందని మళ్లలోనే కుప్పలు వేసుకున్నాం, వర్షాలకు కుప్పలు తడిసిపోయాయి, మళ్లల్లో నీరు నిలబడటంతో అడుగు భాగంలో మట్టు నానిపోయింది, బయటకు వచ్చేదారిలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.


కరపలో వర్షంనీటిలో నానుతున్న వరికుప్పలు

ముంపునకు గురైన గ్రామాలు

కాగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్‌లు వీఏఏలతో కల్సి ఆయా గ్రామాల్లో పర్యటించి, రైతులకు సూచనలు చేశారు. అరట్లకట్టలో రెండు విద్యుత్ స్తంభాలు పడిపోగా, ఏఈ సానా ఈశ్వరప్రసాద్ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి, సరఫరాను పునరుద్ధరించారు. వేళంగి పీహెచ్‌సీకి ఎదురుగా వర్షంనీరు నిలబడిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు.


వలసపాకల లేఅవుట్‌లో ఆరబెట్టడానికి బరకాలు తీసిన ధాన్యంరాశులు


కరపలో మొలకలొచ్చిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

సహాయక చర్యలు వేగవంతం చేయండి

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్

కాకినాడ: మిచాంగ్ తుపాను ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాలను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం పరిశీలించారు. గుడారిగుంట, రాధానగర్, మేడలైన్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి, వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ముంపు నీరు తొలగించే చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాధానగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను మాజీ కార్పొరేటర్ కంపర బాబి, స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. న్యాయపరమైన వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్న అక్కడి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తే చాలా వరకు ముంపు సమస్య పరిష్కారమవుతుందని కమిషనర్‌కు వివరించారు. అనంతరం అధికారులతో కలిసి కమిషనర్ మేడలైన్ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ గుర్రపు డెక్క తొలగింపు కోసం సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు

కమిషనర్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల వల్ల అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమైనప్పటికీ, సాయంత్రం లోపే చాలా ప్రాంతాల్లో సమస్య పరిష్కారమైందన్నారు. డ్రైనేజీ సమస్యను ఆధునీకరించటం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పాయన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెనువెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో గాలికి చెట్లు, కొమ్మలు విరిగిపడినప్పటికీ, యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌కు అవాంతరం లేకుండా చేశామన్నారు. వర్ష ప్రభావం తగ్గిన అనంతరం శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్‌ను ఆదేశించారు. అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఈఈలు వెంకటరావు, మాధవి, శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, మాజీ కార్పొరేటర్ కంపర బాబి తదితరులున్నారు.


గుడారిగుంట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

యుద్ధ ప్రాతిపదికన చెట్ల తొలగింపు

కాకినాడ: మిచాంగ్ తుపాను కారణంగా రహదారులపై విరిగిపడ్డ చెట్లు, చెట్టు కొమ్మలను నగరపాలక సంస్థ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన తొలగించింది. కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ సత్యకుమారి ఆదేశాల మేరకు ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్ ఆధ్వర్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. నగరంలోని దాదాపు 26 ప్రాంతాల్లో గాలులకు కొన్నిచోట్ల చెట్లు విరిగిపడడం, మరికొన్ని చోట్ల చెట్టు కొమ్మలు కూలడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే ముందుగానే ఏర్పాటు చేసిన నాలుగు బృందాల ఆధ్వర్యంలో వీటిని తొలగించి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. గాలుల తీవ్రత నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో ఇబ్బందులను ముందుగానే పసిగట్టి, కమిషనర్ ఆదేశాలతో ముందుగానే ఎండిన చెట్లు, చెట్టు కొమ్మలను తొలగించడంతో సమస్య తప్పిందని ఉద్యాన సహాయ సంచాలకుడు శిరిల్ చెప్పారు.


నగరంలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

ఆరోసారి అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ

కాకినాడ సిటీ: బంగారం, వెండి, వజ్రాల వర్తక సంఘం అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ ఆరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కాకినాడ తిలక్ వీధిలో ఉన్న సంఘం హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏటా గణపతి నవరాత్రుల సందర్భంగా నిమజ్జనం రోజున, డిసెంబర్ ఆరున సమావేశం రోజున దుకాణాలకు సెలవు ప్రకటించాలని నిర్ణయించారు. అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా పట్నాల రాము, అధ్యక్షుడిగా అనిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎండీ బహదూర్, కార్యదర్శిగా మహిడి శ్రీనివాస్, కోశాధికారిగా ఆవుపాటి సత్యనారాయణ, సంఘ భవన అధ్యక్షుడిగా నాగులకొండ రాము, ఉపాధ్యక్షుడిగా మందారపు బ్రహ్మానందం, కార్యదర్శిగా మట్టపల్లి సురేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కొండయ్యపాలెపు రాంబాబు, కోశాధికారిగా బవిరిశెట్టి విశ్వనాథం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వాకచర్ల సూర్యం వ్యవహరించారు. నూతన అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తామన్నారు. తూరంగి బరియల్ గ్రౌండ్‌కు వ్యక్తిగతంగా రూ.1.50 లక్షలు ఖర్చు చేశానన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రౌండ్ ఆధునీకరణకు రూ.10 లక్షలు ప్రకటించారన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గం

బాధితులకు భోజన సదుపాయం

కాకినాడ రూరల్: తుపాను ప్రభావంతో కాకినాడ రెండో డివిజన్‌లోని కొండేలుపేట లోతట్టు ప్రాంతంలో 40 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బుధవారం భోజన సదుపాయం కల్పించారు. డివిజన్‌లోని నాయకులు సూర్యప్రకాష్, సూరిబాబు, 3వ డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ తదితరులు సేవలందించారు.


కొండేలుపేటలో భోజనం అందజేస్తున్న దృశ్యం

స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు

కరప: మానవులంతా సమానమేనని చాటిచెప్పిన స్ఫూర్తి ప్రదాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలసి అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మండల ఎస్సీ నాయకులు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. వేములవాడ శివారు పోలినాటివారివీధిలో ఎస్సీ నాయకుడు వజ్రపు కామేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, మార్రెళ్ల వెంకటరమణ, వసుం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, జి.భావారంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, గొర్రిపూడిలో ఊబా కిశోర్‌బాబు, నడకుదురులో దాలిపర్తి శ్రీనివాస్, కరప పంచాయతీలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శి నాగేంద్రకుమార్ నివాళులర్పించారు.

రమణయ్యపేటలో..

కాకినాడ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఎస్సీ నాయకులు చెల్లి దేవరాజు, జాన్ ప్రభాకర్, మోకా కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల చిన్నా, బాలాజీ నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కాకినాడ గుడారిగుంట, వాకలపూడి, వలసపాకల, తిమ్మాపురం తదితర చోట్ల వర్ధంతి నిర్వహించారు. కాకినాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఈఓపీఆర్అండ్ఆర్‌డీ రామాంజనేయులు, సూపరింటెండెంట్ శేఖర్ నివాళులర్పించారు.

ఏపీఎన్జీవో హోంలో..

కాకినాడ క్రైం: కాకినాడ ఏపీఎన్జీవో హోంలో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, సిటీ యూనిట్ అధ్యక్షుడు షేక్ అజీజ్ పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి పూలమాల వేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

కరప: వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలుచేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) పిలుపుమేరకు బుధవారం మండల అంగన్‌వాడీలు కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు.


కరప ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

బెరాకా చర్చ్‌లో క్రిస్మస్ వేడుక

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని బెరాకా బ్లెస్సింగ్ చర్చ్‌లో కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్య క్రిస్మస్ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు జాన్ వెస్లీ, ఏపీపీఎస్‌పీ సభ్యుడు సోనివుడ్, రెవ.జోసెఫ్ బెన్నీ, సురేంద్ర పాల్గొన్నారు.

ఇంద్రపాలెం ఎస్‌హెచ్‌ఓగా ప్రమోద్



కాకినాడ రూరల్: డీఎస్పీ శిక్షణలో భాగంగా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా కె.ప్రమోద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్సై మణికుమార్ ఆయనకు ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. సుమారు రెండు నెలల పాటు శిక్షణలో భాగంగా ఇంద్రపాలెం పోలీసు స్టేషన్‌లో కేసుల నమోదు, విచారణ చేపట్టనున్నారు.

శత కోటి కుంకుమార్చనల దిశగా..

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం బుధవారం 23వ రోజుకు చేరుకుంది. పరిపూర్ణానంద స్వామి ఆశీస్సులతో మహాశక్తి యాగం విజయవంతంగా జరుగుతోంది. శత కోటి లలితా కుంకుమార్చనలు, నక్షత్ర పూజలు, తిథి పూజలు, బగళాముఖి హోమం, కోటి దీపోత్సవం, అతిరుద్ర యాగం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న పాడ్యమి రోజున పూర్ణాహుతితో యాగం ముగుస్తుందని పరిపూర్ణానంద స్వామి తెలిపారు.

యండమూరు డ్రెయిన్‌లో అడ్డుకట్టల తొలగింపు

కరప: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఆర్ఐ పి.మాచర్రావులు తమ సిబ్బందితో కల్సి బుధవారం యండమూరు డ్రెయిన్‌లో అడ్డుకట్టలు తొలగించారు. ఎమ్మెల్యే కన్నబాబు యండమూరులో పర్యటించినప్పుడు, గ్రామ రైతులు రొయ్యల చెరువుల యజమానులు డ్రెయిన్‌లో అడ్డుకట్టలు వేయడం వల్ల తమ పొలాలు ముంపునకు గురైనట్టు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి మురుగుకాలువ గట్టుపై ఉన్న ఆక్రమణలు, డ్రెయిన్‌లో అడ్డుకట్టలు తొలగించాలని రెవెన్యూ, వ్యవసాయాధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు అడ్డుకట్టలు తొలగించారు. సిరిపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నున్న వీరబాబుతో కల్సి అధికారులు రైతులకు నచ్చజెప్పి, 312 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

ఆడపడుచులకు అండగా..

- అక్క, చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో చేయూత
- డ్వాక్రా మహిళల హర్షాతిరేకాలు

బోట్‌క్లబ్: మహిళా సాధికారత అనేది గతంలో అనేక రాజకీయ పార్టీల నాయకులకు ప్రచార పదంలా ఉండేది. నిజంగా అందుకనుగుణంగా ఆయా పార్టీలు, నాయకులు కృషి చేసిందీ లేదు. అందలం ఎక్కగానే ఆ సంగతి మర్చిపోవడం షరా మామూలుగానే సాగుతుండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత అనే పదానికే సార్థకత చేకూర్చారు. చేయూత, ఆసరా, డ్వాక్రా రుణాలు, సున్నా వడ్డీ వంటి పథకాలు ప్రవేశపెట్టి ఆడపడుచులకు వెన్నుదన్నుగా నిలిచారు. మహిళలు తమ కుటుంబాలకు బాసటగా నిలిచే చక్కటి అవకాశాన్ని కల్పించారు. అందుకే ఈ రోజు రాష్ట్రంలో మహిళలంతా సీఎం సంక్షేమ దృక్పథానికి జేజేలు పలుకున్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించిన ప్రభుత్వం.. క్రమంతప్పకుండా అందజేస్తూ వస్తోంది. రుణాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీని వర్తింపజేస్తోంది. స్వయం సహాయక సంఘాల రుణ ఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నారు. బకాయి ఉన్న సంఘాలు పూర్తిగా చెల్లిస్తేనే, సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో.. ఆ నెలకు మాత్రమే సున్నా వడ్డీని పొందుతున్నారు. నాలుగేళ్లగా సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ ఏడాది తీసుకున్న కొత్త రుణాలకు సైతం సున్నా వడ్డీ రుణాలను విడుదల చేస్తోంది.


రామకృష్ణారావుపేటలో కిరాణాషాపు నిర్వహిస్తున్న సంఘ సభ్యురాలు

గత నాలుగేళ్లలో పొందిన లబ్ధి..

సంవత్సరం	సంఘాలు	రూ.(కోట్లలో)
2019–20	4,215	5.56
2020–21	5,025	4.86
2021–22	5,505	6.71
2022–23	5,616	9.09

చిరు వ్యాపారాలతో ఆర్థిక స్వావలంబన

మహిళా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాలతో ఇంటి వద్ద చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇంటి సమీపంలోనే కిరణా షాపు, టీ దుకాణం, బడ్డీ కొట్టు వంటివి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. బ్యాంకు ఇచ్చిన రుణానికి వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఆయా సంఘాల సభ్యులకు ఎంతో లాభం చేకూరుతోంది. ఏటా సంఘాలు పెరుగుతున్నప్పటికీ, వాటికి వడ్డీ రాయితీ చెల్లిస్తూనే ఉన్నారు.

ఆర్థిక భరోసా దొరికింది



సున్నా వడ్డీ ద్వారా మాకు ఆర్థికంగా భరోసా లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం మహిళల కోసం ఆలోచించే వ్యక్తి కావడం ఆనందంగా ఉంది. ఆయనకు రుణపడి ఉంటాం.

– వంగ సుబ్బలక్ష్మి, సంఘ సభ్యురాలు

తిరిగి చెల్లిస్తున్నారు



ఇంటి అవసరాల కోసం డ్వాక్రా గ్రూపు ద్వారా రుణం తీసుకున్నాం. ఆ రుణంపై వడ్డీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకం ద్వారా తిరిగి చెల్లించడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– ఉష, సంఘ సభ్యురాలు

కిరణాషాపు పెట్టుకుని..



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో వచ్చిన డబ్బులతో కిరణాషాపు పెట్టుకుని జీవితం సాగిస్తున్నాను. రోజుకు రూ.300 నుంచి రూ.400 లాభం వస్తుంది. మా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంది. మా కుటుంబం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– కె.అనురాధ, మెహబూబా మహిళా సంఘం